# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఈ ఏడాది డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లను ఆదేశించారు.
- ❖ రాష్ట్రంలో ఖరీఫ్-2026 సీజన్ కోసం వ్యవసాయ శాఖ సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉందని మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.
- ❖ ఏపీ ఈసెట్ ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు విడుదల చేశారు.
- ❖ పరిపాలనకు సాంకేతికతను అనుసంధానించడంతో పాటు మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు.

=======================

ఈ ఏడాది డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలను వాట్సాప్‌లో అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ఈరోజు మాట్లాడుతూ... ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. ఇప్పటికే “మనమిత్ర” ద్వారా 29 లక్షల మందికి వాట్సాప్ గవర్నెన్స్‌పై శిక్షణ ఇచ్చామని గుర్తు చేశారు. దాంతో 90 శాతం సేవలు వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

ఇదిలా ఉండగా... పేద, మధ్య తరగతి, బలహీన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు నాయుడు తెలిపారు. విద్య, వైద్యం, సామాజిక అభివృద్ధి విషయాల్లో ప్రత్యేక దృష్టిని పెట్టామని చెప్పారు.

=======================

రాష్ట్రంలో ఖరీఫ్–2026 సీజన్ కోసం వ్యవసాయ శాఖ సమగ్ర కార్యాచరణ ప్రణాళితో సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు సమయానికి అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. 2026-27 సంవత్సరానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా 294 కోట్ల రూపాయల బడ్జెట్‌తో 7.46 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు రాయితీపై సరఫరా చేస్తామని మంత్రి వెల్లడించారు. ఖరీఫ్ లో అవసరమైన 93 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 30 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సేకరించి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు.

========================

ఏపీ పాలిటెక్నిక్ డిప్లొమో పూర్తయిన విద్యార్థులకు బీటెక్ ద్వితీయ సంవత్సర ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈసెట్ ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు విడుదల చేశారు. అర్హత సాధించిన విద్యార్థులందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. ఫలితాల కోసం cets.apsche.ap.gov.in/ECETలో లేదా వాట్సాప్ (మన మిత్ర) 95523 00009 నెంబర్‌కు "Hi" అని మెసేజ్ పంపి తెలుసుకోవచ్చు. ఈసెట్ ఫలితాల్లో 91.72 శాతం ఉత్తీర్ణత సాధించారు. 32 వేల 434 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 29 వేల 750 మంది అర్హత సాధించారు. ర్యాంక్ కార్డులు సంబంధిత వెబ్‌సైట్‌లో లేదా వాట్సాప్ నంబర్ ద్వారా అందుబాటులో ఉంచినట్లుగా అధికారులు వెల్లడించారు.

========================

అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపించవద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు సూచించారు. 7వ జిల్లా కలెక్టర్ల  సదస్సు రెండవ రోజున వివిధ అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఫైళ్లను వేగంగా పరిష్కరిస్తే... ప్రభుత్వ సేవలు త్వరగా ప్రజలకు అందుతాయన్నారు. పరిపాలనకు సాంకేతికతను అనుసంధానించడంతో పాటు మానవీయ కోణంలో ఆలోచించి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ లో అర్జీలు స్వీకరిస్తున్నట్టుగానే ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

========================

బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలో ఈరోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ... ఈ అంశంపై కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోగా ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తించే ప్రతీ ప్రయోజనాన్ని బుడగ జంగాలకు వర్తింప చేయాలని కలెక్టర్లకు సూచించారు. తక్షణమే ఈ అంశాన్ని అమల్లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

========================

వేసవిలో ఎటువంటి అంతరాయం లేకుండా గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థను కొనసాగించేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ సమగ్ర వేసవి కార్యాచరణ ప్రణాళిక–2026ను అమలు చేస్తోందని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆయన ఈరోజు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 251 మండలాల్లో గుర్తించిన 2 వేల 106 సున్నిత నివాస ప్రాంతాల కోసం 40 కోట్ల 47 లక్షల రూపాయల వ్యయంతో ప్రత్యేక కాంటింజెన్సీ ప్రణాళిక రూపొందించబడిందని చెప్పారు. ఇందులో కరువు ప్రభావిత 28 మండలాలకు 4 కోట్ల 94 లక్షల రూపాయలు, మిగిలిన 223 మండలాలకు 35 కోట్ల 53 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని ఆయన వివరించారు.

========================

భూముల సర్వేలో పారదర్శకత కోసం ఇకపై క్షేత్రస్థాయి పరిశీలన చేపడతామని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (CCLA) జి. జయలక్ష్మి తెలిపారు. అదే విధంగా నోటీసుల జారీ దశలలో భూ యజమానులకు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా ఈ-కేవైసీ విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సదస్సులో ఆమె భూపరిపాలనకు సంబంధించిన కీలక అంశాలపై ప్రెజెంటేషన్ ను ఈరోజు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో తప్పుల్లేకుండా సర్వే జరగాలనే ఉద్దేశంతో గడువును 223 రోజులకు పెంచినట్లుగా వెల్లడించారు. భూ సమస్యల పరిష్కారంలో సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో 2027 మార్చి నెలాఖరు నాటికి లక్ష్యాల మేరకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ వంద శాతం పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని ఆమె తెలిపారు. అత్యాధునిక బ్లాక్ చైన్ టెక్నాలజీతో రికార్డులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని జయలక్ష్మి వివరించారు.

========================

రాష్ట్రంలో 2027 డిసెంబర్ నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా ముఖ్యమంత్రి ఈరోజు మాట్లాడుతూ... ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీలోగా 2 లక్షల 50 వేల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలని కోరారు. డిసెంబర్ నాటికల్లా మరో 2 లక్షల 38 వేల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేయించాలని సూచించారు. ఇల్లు లేని పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇబ్బందులు లేని చోట భూసేకరణ లేదా సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని చంద్రబాబు నాయుడు కోరారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో బీసీ కులాల వెనుకబాటుతనం అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశామని, ఆ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి చెప్పారు.

========================

కొమొరిన్ నుండి కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా మధ్యప్రదేశ్ వరకు సముద్ర మట్టానికి సగటున 900 మీటర్ల ఎత్తులో అల్పపీడన ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి నారాయణ తెలియచేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================
========================